# విరిగిపడని శిఖరం

మన్నెం శారద





ఆయన భోంచేస్తున్నారు.

ఆయనకి ఎదురుగా మరో కుర్చీ లాక్కుని ఆయనవంకే చూస్తూ కూర్చున్నాను. ఆయన నన్ను గమనించడం లేదు. బాగా ఆకలిగా వుందేమో, త్వర త్వరగా తింటున్నారు. చూస్తుండగానే పచ్చడి అన్నంలోంచి కూరలోకి జంప్ చేసి పెరుగులో కొచ్చా.

నేను అసహనంగా నిట్టూర్చేను.

నోట్లో పెట్టుకోబోతున్న ముద్ద ఆపి

కళ్ళెత్తి నా వంక చూసేరు. చూసీ చూడగానే నవ్వుతూ "అర్థమయింది" అన్నారు.

"అబ్బ! ఇప్పటికి!" అన్నాను నిష్ఠూరంగా.

"నిజంగా ఆడపిల్ల తల్లి ననిపించుకున్నావ్! ఎందుకంత కంగారు? ఈ సంబంధం కాకపోతే మరొకటి!" సర్లక్ష్యంగా అన్నారు.

"నిజమే ననుకోండి. కాని ఎందుకో పెళ్లికొడుకు నన్ను చాలా ఇంప్రెస్ చేసేడు! డబ్బు, హోదా వున్నవాళ్ళని. ఎర్రగా బుర్రగా వున్నవాళ్ళనీ మనం తేగలం. కాని సంస్కారవంతుడు దొరకటం అదృష్టం కామా!"

"పెద్ద వుద్యోగంలో వున్నప్పటికి అతని సింప్లిసిటీ, పెద్దలపట్ల వినయం, ఎదటివారిని గౌరవించే విధానం...."

"వాటన్నిటినీ మించి కట్నం వద్దనటం" ఆయన నవ్వుతూ పూర్తిచేసేరు

"అదీ నిజమే! ఈ రోజుల్లో కుటుంబాన్ని, అమ్మాయిని చూసి ఎవరండీ చేసుకుంటున్నది?" అన్నాను.

ఆయన నవ్వుతూ అవునన్నట్లుగా తల పంకించేరు.

"ఇంతకీ అసలు సంగతి చెప్పేరు కాదు. వాళ్ళ నుండి కబురేమైనా వచ్చిందా?" అన్నాను ఆత్రుతగా.

"ఆ! ప్రొద్దుట పెళ్ళికొడుకు పిన తండ్రి ఫోన్‌చేసేరు. ముహూర్తం చూసుకోమని."

"హమ్మయ!" అన్నాను సంతోషంగా.

ఆయన ఆ రోజు న్యూస్‌పేపర్ తీసుకుని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయేరు. నేను డైనింగ్‌టేబుల్ క్లీన్‌చేసి, వంటగది సర్దుతున్నాను. యాంత్రికంగా పనులు చేసుకుపోతున్నా నా మనసు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతున్నది.

సిద్ధార్థ నా అల్లుడు కాబోతున్నాడన్న విషయం నాకు ఎనలేని సంతోషాన్ని కల్గజేస్తున్నది. మాటిమాటికి నా మనసు సిద్ధార్థని గాయత్రి పక్కగా పెట్టి వూహించి మురిసిపోతున్నది.

ఎందుకో తెలియదు! అతని పట్ల నాకు విపరీతమైన అభిమాన మేర్పడింది. అతను మంచి హోదాలో వున్నాడన్నది, చూపులకు ఆరోగ్యంగా అందంగా వున్నాడన్నది నాఅభిమానానికి కారణాలు కాదు. మొదటినుండి మేనర్సు, డిసిప్లిన్ అంటే చచ్చిపడే నాకు అతనిలో అవి కొట్టొచ్చినట్లు కనబడేసరికి నాకు కాదగ్గ అల్లుడి తనేనని మనసు అదేపనిగా ఘోషించింది.

గాయత్రిని చూపించినప్పుడు అతను అందరిలా చిల్లర ప్రశ్నలు వేయలేదు. ఎం. ఏ. లిటరేచర్ చేసిన గాయత్రిని. సాహిత్యం గురించి అడిగేరు. గోల్డు మెడలిస్టయిన నా కూతురికి కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌పట్ల ఎందుకు ఇంటరెస్టు లేదని ప్రశ్నించేడు. పెళ్ళిపట్ల ఎలాంటి అభి

ప్రాయలున్నది సుతిమెత్తగా సూచన ప్రాయంగా అడిగి తెలుసుకున్నాడు. అలా అడుగుతున్నప్పుడు అతను పెళ్ళి కొడుకు హోదా ప్రదర్శించలేదు. కొంత మంది మగపిల్లల్లా సోఫాకి జేరబడి, కాళ్లు తిప్పుతూ బడాయి చూపించ లేదు. ఎన్నాళ్ళకో కనబడ్డ స్నేహితుడిలా ఎంతో గౌరవంగా కూర్చుని గాయత్రికి మాత్రం వినిపించేంత గొంతుతో మార్ధ వంగా మాట్లాడేడు. నీటుగా సున్నగా దువ్విన క్రాపు, తెల్లటి బట్టలు, సున్నగా మెరుస్తున్న బూట్ అతని క్రమశిక్షణని తెలియబరుస్తున్నాయి.

మధ్యలో ఆ గదిలోకి మా వారెం దుకో వెళ్ళినప్పుడు వినయంగా లేచి నిల బడ్డాడు, కాఫీ లందించేందుకు నేను ట్రే తీసుకెళ్తే విష్‌చేసి నవ్వేడు. అతని తల్లిదండ్రుల ప్రసక్తి వచ్చినప్పుడు వారి పట్ల అతను మాట్లాడిన మాటలలో ఎంతో ఆప్యాయత కన్పించింది. అతను లేచి వెళ్తున్నప్పుడు ఆ నడక ఎంతో ఠీవిగా వుంది. ఆ అడుగులు ఎంతో డిసిప్లిన్డ్‌గా నిదానంగా వున్నాయి.

ఇన్ని రకాలుగా నా మనసుని ఆక ర్షించిన సిద్ధార్థ నాకు కొద్ది రోజుల్లో అల్లుడిగా ఈ ఇంటికి రాబోతున్నాడన్నది, నా జీవితాశయం నెరవేరినంత హాయిగా వుంది.

హాల్లోకి వచ్చేను. గాయత్రి గదిలో ఇంకా లైటు వెలుగుతోంది.

ఇంకా చదువు కుంటున్నది కాబోలు!

"అమ్మా ఒకసారిలా వస్తావా?" నా అడుగుల చప్పుడు విని పిలిచింది. లోపలికి వెళ్ళేను.

"ఏవిటి?" అన్నాను మంచంమీద కూర్చుంటూ.

గాయత్రి ఒక క్షణం మాట్లాడలేదు. ఏదో చాలా సేపటినుండి తీవ్రంగా ఆలో చిస్తున్నట్లు దాని ముఖం వాడి వుంది.

'ఏమయి వుంటుంది' అని ఆలోచి స్తున్న నేను "నాకీ పెళ్ళి యిష్టంలేదమ్మా" అన్న దాని మాటకు మంచం కింద బాంబు పేలినట్లు వులిక్కిపడ్డాను.

వెంటనే తెల్లబోయేను. ఆ పైన కోపం ముంచుకొచ్చేసింది.

"ఎందుకని?" అన్నాను తీవ్రంగా. నా గొంతులోని తీవ్రతకి అది జంకి నట్లుంది. మాట్లాడకుండా కూర్చుంది. ఒక్క క్షణం నా తొందరపాటుకి సిగ్గు పడ్డాను. గాయత్రి చిన్నపిల్ల కాదు.

ఇంగ్లీషు లిటరేచర్‌తో ఎం. ఏ. లో యూనివర్శిటీ ఫస్టు సాధించింది. ఒక విమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా బాధ్యతా యుతమైన వుద్యోగం చేస్తున్నది. పైగా నా కూతురని గొప్ప చెప్పుకోవటం కాదు గాని-అది చాలా డిసిప్లిన్డ్‌గా పెరిగింది. ఎక్కడెలా మసలుకోవాలో, ఎవరితో ఎంతవరకు మాట్లాడాలో దానికి తెలిసి నంతగా నాకు కూడ తెలియదు. అలాంటి



యువ

ఎదిగిన పిల్లమీద ఎగిరిపడటం నాకే చిన్నతన మనిపించింది.

అందుకే నా తప్పుని సరిదిద్దుకుంటూ లాలనగా దాని తల నిమురుతూ అన్నాను "చాలా మంచి సంబంధం గాయత్రీ! పెళ్ళికొడుకుని నువ్వు కూడా చూసేవుగా. నవమన్మధుడు కాకపోయినా ఎత్తుకి తగ్గ లావుతో ఆరోగ్యంగా వున్నాడు. చక్కటి వుద్యోగం-వీటన్నిటినీ మించిన సంస్కారం.... నీకెందుకు నచ్చలేదు?"

గాయత్రి మెల్లిగా అంది "నచ్చలేదని ఎవరన్నారు? అతనికి కాబోయే భార్య నిజంగా అదృష్టవంతురాలు."

"అతను నిన్ను పెళ్ళిచేసుకునేందుకు ఇష్టపడ్డాడు. ముహూర్తాలు కూడా పెట్టుకోమని కబురొచ్చింది. ఆఅదృష్టం నీదే అవ్వబోతున్నది."

"లేదమ్మా. నేను రాజేంద్రని చేసుకోవాలని ఎప్పుడో నిర్ణయించుకున్నాను."

"ఎవరతను?"అన్నాను ఓర్పుగా.

"అతను పోస్టుగ్రాడ్యుయేషన్‌లో నా క్లాస్‌మేట్. ప్రస్తుతం ఇక్కడే ఆంధ్రా బేంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా వున్నాడు."

"మీ ఇద్దరూ ప్రేమించుకున్నారా?"

గాయత్రి తల దించుకుంది "ప్రేమంటే.... ఏమో! అదేం తెలియదు నాకు. మేం ఒకరి నొకరు లైఫ్ పార్టనర్స్ కావాలనుకున్నాం."

నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. గాయత్రి తన వయస్సుకి మించి రిజర్వుడుగా వుంటుంది. దానికి గర్ల్ ఫ్రెండ్స్ లేరు. అలాంటిది ఒక లవర్!

నేను కొంచెం నిస్పృహగా నే అన్నాను. "సరే గాయత్రీ! మీ నాన్నగారికి కూడ చెబుతాను. పెద్దవాళ్ళం-పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఆదుర్దా కొద్దీ ఎన్నో వూహించుకుంటాం. నడక నేర్చినవాణ్ణి పడిపోతాడనే భయంతో ఎత్తుకు తిప్పడం ధర్మంకాదు. మీ భవిష్యత్తు మీరుగా నిర్ణయించుకున్నప్పుడు అంగీకరించి అక్షింతలు వేయడమే శ్రేయస్కరం."

నా మాటలలో దానికి నిష్ఠూరం ధ్వనించిందేమో, కాస్సేపు మాట్లాడలేదు. నా గుండెలో చెప్పలేని బరువు! గాయత్రిని మెడలువంచి సిద్ధార్థకిచ్చి చేయాలన్నంత తెగింపు! కాని సంస్కారం అడ్డొచ్చి నా ఆవేశాన్ని నొక్కిపెడ్తున్నది.

"అమ్మా, నువ్వొకసారి రాజేంద్ర అమ్మగారితో మాట్లాడాలి."

"ఎందుకు?"

"పెళ్ళివిషయం మీ పెద్దవాళ్ళు కదిలిస్తే బాగుంటుందని రాజేంద్ర అన్నాడు."

నాకు చెప్పలేని ఆవేశం పొంగుకొచ్చింది. "ఓహో! మగపెళ్ళివారి

తీవి ఒలకబోస్తున్నాడా?" అన్నాను వెటకారంగా.

"కాదమ్మా. ఆమె అదోరకమట! ఆమెకు ఇష్టంలేని ఏపని చేసినా హిస్టిరికల్‌గా ఫీలయి గోలచేస్తుందట. అప్పైన ఫెయింటయిపోతుందట. అందులో ఇది పెళ్ళివిషయం! అందుకే ఆమెని కన్విన్స్ చేసి ఆమె ఇష్టప్రకారమే జరుగుతుందని పిస్తే...." నా ముఖంలోకి చూసి ఆగిపోయింది గాయత్రి.

"ఒకవేళ ఆమె కన్విన్స్ కాకపోతే రాజేంద్ర నిన్ను పెళ్ళిచేసుకోడా?"

గాయత్రి మాట్లాడలేదు.

"చూడు గాయత్రీ! మీరిద్దరూ పెద్దల ప్రమేయం లేకుండా నే ప్రేమించుకున్నారు. పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సిద్ధార్థలాంటి మంచి యువకుణ్ణి కాదంటున్నావనే నాకు రవ్వంత బాధగా వుంది గాని, అన్నివిధాల అన్నీ తెలుసుకున్న విద్యావతివి – నీవు ఎన్నుకున్న యువకుణ్ణి అల్లుడిగా అంగీకరించడానికి నా కెలాంటి అభ్యంతరమూ లేదు. పెద్దలకి చెప్పడం వారి అంగీకారం తీసుకోవటం ఉభయత్రా మంచిదే. ఒకవేళ మేం అంగీకరించని పక్షంలో ధైర్యంగా మీరు నిలబడి పెళ్ళిచేసుకోలేని పక్షంలో దానంత సిగ్గుచేటయిన విషయం మరొకటి లేదు."

గాయత్రి మౌనాన్ని ఆశ్రయించింది.

"సరే! ఆ ఎడ్రసివ్వు! ప్రయత్నిస్తాను" అన్నాను లేస్తూ.

* * *

గాయత్రి ఇచ్చిన ఎడ్రస్ ప్రకారం అక్కడికి చేరుకున్నాను. కొంచెం ఎత్తుమీద అధునాతనంగా కట్టబడి వుందా ఇల్లు. గేటుతీసుకుని లాన్‌లోకి వెళ్ళేను. ఎదుటగా భౌ భౌ మంటూ ఎర్రబడి చూస్తున్నది అల్సేషియన్ కుక్క.

భయంగా నిలబడిపోయేను.

దాని అరుపులకి ఒక యువకుడు బయటకివచ్చి దాన్ని 'జూలీ చుప్' అంటూ నా వైపు ప్రశ్నార్థకంగా చూసేడు. ఈనాటి నవనాగరికతకి లక్షణంగా హిప్పీస్టైయిల్‌లో జుట్టు, మూతి క్రిందిదాక దిగిన వత్తైన మీసాలు– బలంగా చురుకుగా వున్నాడు.

"మీ పేరు?" అన్నాను అనుమానంగా

"రాజేంద్ర. మీకు ఎవరు కావాలి?" అన్నాడు.

నేను నవ్వుతూ "నా పేరు జానకి. గాయత్రికి తల్లినవుతాను" అన్నాను.

అత నీసారి నవ్వుతూ "హల్లో" అన్నాడు పరిచయంగా.

నాకు కొద్దిగా అవమానమనిపించింది. అతడు గౌరవంగా పెద్దదాన్నయిన నన్ను చూసి నమస్కారం అంటే సంతోషమనిపించేది. అందరూ నా పద్ధతిలోనే వుండాలనుకోవటం సబబు కాదని మనసుని సమర్ధించుకున్నాను.



"మమ్మీ సంబడీ కేమ్ ఫర్ యూ" అంటూ లోపలికి కేకపెట్టి 'రండి' అంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి తీసికెళ్ళాడు.

డ్రాయింగ్ రూమ్ అప్‌టూడేట్‌గా వుంది. నేలమీద మెత్తటి కార్పెటు, కిటికీలకు అందమైన పలుచని తెరలు, లేత ఆలీవ్ గ్రీన్ రంగులో మెరుస్తున్న డిస్టెంపర్ చేసిన గోడలు, టి.వి. సెట్టు, రేడియోగ్రామ్ ఆ గదికి అందంతెచ్చేయి.

రాజేంద్ర రేడియోగ్రామ్ ఆన్‌చేశాడు. నేను అతని కదలికలు పరిశీలిస్తున్నాను. అతను నాతో ఏం మాట్లాడలేదు. గ్రామ్‌లో వస్తున్న పాశ్చాత్య సంగీతానికి అనుగుణంగా తలవూపుతూ ఏదో మాగజైన్ తిరగేస్తున్నాడు.

ఇంతలో అడుగుల సవ్వడి వినిపించి అటుతిరిగాను.

ఇంచుమించు నా వయసు స్త్రీ, నా కన్నా అధునాతనంగా అలంకరించుకుని ఆ గదిలోకి వచ్చింది.

"మీట్ మై మదర్ శ్యామల"అన్నాడు రాజేంద్ర.

నేను లేచి నిలబడి "నమస్కారం" అన్నాను.

"కూర్చోండి" అంది ఆమె ప్రతి నమస్కారం చేస్తూ.

రాజేంద్ర ఆ గదిలోంచి వెళ్ళిపోవటం నేను గమనిస్తూనే వున్నాను. నాకు చాల ఆశ్చర్యమనిపించింది. అతడు నే నెవరో పరిచయం చెయ్యకుండా తప్పించుకున్నాడు. ఈ రకమైన పిరికితనమున్న మగవాళ్ళంటే నాకు పరమ అసహ్యం.

"మీ రెవరో నాకు తెలిసినట్లు లేదు."

ఆలోచనలనుండి బయటపడి ఆమె వైపు చూసేను. విశాలమైన కళ్ళను కాస్త అరమోడ్పుగా వుంచి, చిన్నగా నవ్వింది ఆమె. బిగుసుకునివున్న ఆమె మెడనరాలు ఆమెలోని అహంభావానికి ప్రతీకల్లా కన్పించేయి నాకు. వెంటనే నా ఆలోచనలు చాల వెనక్కి పరిగెత్తటం ప్రారంభించేయి.

అవును.... అవును.... ఆ శ్యామలే!

నాకు వెంటనే ఎక్కడలేని వుత్సాహమూ వచ్చేసింది. "శ్యామలా! నన్ను గుర్తుపట్టలేదూ! మనమిద్దరమూ పాతికేళ్ళ క్రితం ఆంధ్రాయూనివర్సిటీలో ఎం.ఏ చేసేం. పైగా హాస్టల్ మేట్స్మి" అన్నాను.

అయితే శ్యామల ఇబ్బందిగా ముఖం పెట్టి "నాకు గుర్తురావటం లేదండీ." అంది.

"నా పేరు జానకి. రెండేళ్ళు కలిసి ఒక రూంలోనే వున్నాము. పోనీ జైరామ్ గుర్తున్నాడా?" అన్నాను.

ఈ సారి ఆమె నా వంక చురుగ్గా చూసి, "చాల సంవత్సరాలు గడిచిపోయేయి. కాస్త గుర్తొస్తున్నది" అంది జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్లు నటిస్తూ. జైరామ్ పేరు ఆమెపై టానిక్కులా పనిచేయడం నాకు నవ్వు తెప్పించినా నేను వచ్చినపని వేరుగా వుండటంవల్ల దాన్ని అదుపులో పెట్టుకున్నాను.

"ఆ! ఇంతకూ నా ఎడ్రస్సెలా తెలిసింది?" అంది.

"నాకు కూడ నీ గురించే తెలియదు. కాస్త పిల్లలు పని కల్పించేరు. అందువల్ల రావలసి వచ్చింది. ఇక్కడకొచ్చే వరకు నువ్వు రాజేంద్ర తల్లివని నాకు తెలియనే తెలియదు."

"రాజేంద్ర నీకు తెలుసా?" అంది భ్రుకుటి ముడిచి.

"నిన్నటివరకూ తెలియదు. రాత్రి నా కూతురు గాయత్రి చెప్పింది."

ఆమె మాట్లాడకుండా చూస్తున్నది.

నేనే తిరిగి మొదలు పెట్టేను. "గాయత్రి, రాజేంద్ర క్లాస్మేట్సట. వారిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నట్లు తెలిసింది. మన అంగీకారం కోసం వాళ్ళెదురు చూస్తున్నారు."

శ్యామల ముఖం ఎర్రబడింది "ఆ ప్రేమ దేముందిలే. కాలేజ్ కెళ్ళి పాఠాలతో పాటు అదీ మొదలుపెడ్తారు. పెళ్ళంటే ఎన్ని చూడాలి!" అంది కాస్త చులకనగా.




నాకు బాధ కలిగింది. అయినా దాన్ని కప్పిపుచ్చుకుంటూ "అలా తీసెయ్యకు. వాళ్ళు మరీ చిన్నపిల్లలు కారు బాధ్యతా రహితంగా ప్రవర్తించేందుకు. ఒకరంటే మరొకరికి యిష్టం వున్నప్పుడు_ వాళ్ళకి మరో అడ్డులేనప్పుడు వాళ్ళ పెళ్ళికి అభ్యంతరమేమిటి?" అన్నాను.

"నీకేం ఆడపిల్ల తల్లివి. ప్రేమ పేరుతో పైసా కట్నంలేని అల్లుడు దొరికితే ఎగరేసుకుపోవాలని చూస్తున్నావు. నాకు వెనుక ఇద్దరు కూతుళ్ళు వున్నారు. వాళ్ళకి నేను కట్నం ఇవ్వాల్సి వుంటుంది." అంది శ్యామల మోటుగా.

నేను దెబ్బ తిన్నట్లు చూసేను. "శ్యామలా, కొంచెం జాగ్రత్తగా మాట్లాడటం మంచిది. నీ కొడుకుని కట్నం లేకుండా ఎరవేసి తీసుకుపోవాలని రాలేదు నేను. నీ కొడుకు కంటే అన్నివిధాల యోగ్యుడు నా కూతుర్ని కట్నం లేకుండా చేసుకుంటానన్నా_ అది వదలుకోవటానికి సిద్ధపడి ఇటు వచ్చేను."

"అంత అవసరమేమిటో?" శ్యామల వెటకారంగా అడిగింది.

"అవసరం కాదు. పిచ్చి! ప్రేమించిన వాణ్ణే పెళ్ళిచేసుకోవాలనే వెర్రి సిద్ధాంతం పెట్టుకున్న నా కూతురికి అంతంకే మంచివాడు దొరికినప్పుడు పాతవాణ్ణి వదిలేయాలన్న విషయం తెలియదు" అన్నాను కసిగా.

శ్యామలకి నా మాట ఎక్కడ తగలాలో అక్కడే తగిలింది. విసురుగా పైకి లేచింది "ఏది ఏమైనా మా వాడికి మీ అమ్మాయిని చేసుకోవటం అసంభవం. మా స్టేటస్‌కి తగినదే చేస్తాం. నా మాట ఏనాటికీ వాడు కాదనడు." అంది గట్టిగా నొక్కి పలుకుతూ.

"మంచిది. నువ్వు రాజేంద్ర తల్లివని తెలిస్తే నీ స్టేటస్ ముందే వూహించి ఇక్కడిదాక వచ్చివుండేదాన్ని కాదు. ఆడపిల్లతో ప్రేమ వ్యవహారం సాగించి అమ్మదగ్గర నోరెత్తలేని ప్రబుద్ధుడు నాకు అల్లుడు కావటం సిగ్గుచేటు" ఈ మాటలు ప్రక్కగదిలో రాజేంద్రకి విన్పించాలనే గట్టిగా అని బయటి కొచ్చేసేను. నా మనసు వెగటుగా అయిపోయింది.

* * *

గాయత్రి ప్రొద్దుటనుండి నన్ను పరిశీలిస్తున్నది.

నేనేం చెబుతానోనని అది ఆత్రుత పడుతున్నదన్న విషయం నాకు అర్థమవుతూనే వుంది. 'నువ్వో పిరికివాణ్ణి ప్రేమించేవు' అని ఎలా చెప్పాలి! అందుకే మౌనం వహించేను.

అయితే రెండురోజుల తర్వాత దానికి సమయం దొరికింది. మావారు సాయంత్రం కేంప్ వెళ్ళటంతో మే మిద్దరమే మిగిలేం. అప్పటికీ దాన్నుంచి తప్పించుకునే వుద్దేశ్యంతో డాబామీదకి వెళ్ళి నవల చదువుకుంటూ కూర్చున్నాను.

మెల్లిగా అడుగుల సవ్వడి విని పించింది.

తలయెత్తి చూసేను. గాయత్రి!

"ఏం తోచటంలేదా?" అన్నాను నవ్వుతూ.

"ఉహు" అంది.

"పిక్చర్‌కి వెళ్దామా?"

"వద్దు. నీతో మాట్లాడాలని." అంది మరో కుర్చీ లాక్కొని కూర్చుంటూ.

నేను మౌనంగా చదువుతున్న నవల పక్కన టీపాయ్‌పైన వుంచి "రాజేంద్ర తల్లి నాకు పరిచయస్తురాలే. నేను చదువుకునే రోజుల్లో ఆమె నా క్లాస్‌మేటే కాక హాస్టల్లో రెండేళ్ళు రూమ్‌మేటు కూడాను" అన్నాను ప్రస్తావనకి నాందిగా.

గాయత్రి ముఖం విప్పారింది. 'అవునా!' అన్నట్లు నవ్వబోయి నా ముఖం చూసి ఆగిపోయింది.

"ఇక్కడ రాజేంద్ర తల్లి గురించి కొంత నీకు చెప్పాలి. తర్వాత నేను వెళ్ళిన సంగతులు చెబుతాను. ఆమె పూర్వకథ ఎందుకు చెబుతున్నానంటే నీవు వెళ్ళాలనుకుంటున్న ఇంటి మనుష్యులు ఎలాంటివారో నీకు తెలియడం మంచిదని."

గాయత్రి వింటున్నది.

"శ్యామల– అంటే రాజేంద్ర తల్లి ఎం.ఏ లో నాతోపాటు వచ్చి చేరింది. నాకిప్పటికీ గుర్తు. జాయినవ్వటానికి వచ్చినప్పుడు వాళ్ళవూరిలో బి.ఏ చేసినా పల్లెటూరి తత్వం ఆమెను పూర్తిగా విడనాడలేదు. కాస్త గట్టిగా రిబ్బను పెట్టిన జడ, పొట్టిపరికిణీలు, జాకెట్లు, ఎవరు పలకరించినా గట్టిగా మాట్లాడటం, జేబురుమాల్లో డబ్బులు చుట్టుకోవటం–

చాల అమాయకంగా అన్పించింది. అయితే రెండు మూడు నెలలలో ఆమె స్వరూపమే మారిపోయింది. రెండు జడలు, పొడువుగా పెంచి ట్రిమ్‌చేసిన గోళ్ళు, హైహీల్స్, మాటలు తుంచి స్టైయిల్‌గా మాట్లాడటం, మగపిల్లలతో పరిచయాలు - అసలు అంత త్వరగా అంతమార్పు ఎవ్వరిలో చూడము. ఇంత ఖచ్చితంగా ఆమెను నేను గమనించ డానికి గలకారణం ఆమె నా రూమ్‌మేట్ కావటమే. క్లాసులోకూడ అబ్బాయిలను, ప్రొఫెసర్స్‌ని ఆకర్షించాలని తెగ ప్రయత్నంచేసేది.

చివరికి ఆమె దృష్టి జైరాజ్ మీద పడింది. జైరాజ్ చాలా అందగాడనే చెప్పాలి. అతని తండ్రి హిందూ. తల్లి ఆంగ్లోఇండియన్. ఈ రెండు కలయిక వల్ల ఏర్పడిన వినూత్న సౌందర్యం అతనిది. నీలి కళ్ళు, నల్లని వుంగరాలక్రాపు, బలిష్టమైన శరీరం, గోధుమ రంగు- ఎలాంటి వారైనా మరోసారి వెనక్కి-తిరిగి చూడాలనిపించే అందమతనిది. దానికి తోడు అతను గిటార్ చాలా చక్కగా వాయించగలడు. చాలా మంది అమ్మాయిలకు అతను ఆరాధ దైవం.

ఒకసారి ఏదో కల్చరల్ ఫంక్షన్‌లో అతను బ్రహ్మాండంగా గిటార్ వాయించేడు. ఆ అదను చూసుకొని శ్యామల అతణ్ణి పొగిడేసింది. ఆ విధంగా అతనితో ఏర్పడిన పరిచయాన్ని నెలరోజుల్లోపలే గట్టి అనుబంధం చేసేసింది. రోజూ అతనితో బీచ్ ఒడ్డున షికార్లు, సినిమాలు-ఒకటేమిటి, తనసే లోకంగా మసలటం ప్రారంభించింది.

శ్యామల నా రూమ్‌మేట్ కావటాన నాకు మరికొన్ని విషయాలు కూడ తెలిసేయి. ఆమెకు ఒక బావ వున్నాడు. అతను స్టేట్స్‌లో డాక్టరు. శ్యామల్ని అతనికిచ్చి పెళ్ళిచేయాలని ఆమె తల్లి దండ్రులు ఆశించేరు. అయితే అతని తల్లి ఇందుకు ఇష్టపడలేదు. 'స్టేట్స్ నుండి వచ్చిన డాక్టరు కొడుకుని చాలా పెద్ద మొత్తంలో అమ్మాలని ఆవిడ ఆశ' అని శ్యామలే చెప్పింది.

"మీ బావే మంటారు?" అడిగేను నేను.

"తల్లి మాటలకు ఎదురు చెప్పడు." అంది శ్యామల.

"మరి ఈ లెటర్స్ వ్రాయడంలో అంతర్యం?" అతని దగ్గర నుండి రెగ్యులర్‌గా వచ్చే వుత్తరాల సంగతి అడిగేను.

"నన్ను పెళ్ళిచేసుకోనంత మాత్రాన శత్రువయిపోతాడా? ఊరికే ఫ్రెండ్లీ ఉత్తరాలు రాస్తాడు" అంది.

విచిత్రమేమిటంటే జైరాజ్‌తో పరిచయం పెరిగిన తర్వాత కూడా ఆమె వాళ్ళ బావకి లెటర్స్ వ్రాయడం మానలేదు.

కాలేజీ అంతా జైరాజ్ శ్యామల ప్రేమ వృత్తాంతం తెలిసిపోయింది. అందరూ ఇదే టాపిక్. అయితే శ్యామల అదేం పట్టనట్లు ప్రవర్తించేది.

"శ్యామలా ఇదేం బాగుండలేదు" అన్నాను ఒకసారి రాత్రి పది గంటల తర్వాత రూమ్‌కి చేరిన శ్యామల నుద్దేశించి.

"ఏది బాగుండలేదు?" భుజాలెగ రేస్తూ నిర్లక్ష్యంగా అడిగింది. నాకు బాగా కోపంవచ్చింది. అయినా తమాయించు కుంటూ అన్నాను.

"అదే జైరాజ్ గురించి– నీ గురించి ఏమనుకుంటున్నారో తెలుసా?"

"అనుకోనీ. నీ కెందుకంత బాధ?"

"అంటే వాళ్ళనుకునే వన్నీ నిజమే నన్న మాట!"

శ్యామల నవ్వింది. "పిచ్చి జానీ, నీ కన్నా వాళ్ళే తెలివయినవాళ్ళు. రూమ్మేటయి వుండి ఈ మాత్రం గ్రహించ లేదంటే ఇంకేం చెప్పను! ఒక అమ్మాయి–అబ్బాయి రాత్రింబవళ్ళు ఒకరి చుట్టూ ఒక రెందుకు తిరుగుతారు? ఇటీజ్ అల్ లౌ! యూ నో!" అంది.

"జైరాజ్ క్రిస్టియన్." అన్నాను.

శ్యామల పగలబడి నవ్వింది. "యూ ఆర్ రియల్లీ ఇన్నోసెంట్! ప్రేమకి ఎల్లలు లేవు మైడియర్ స్వీట్ జానీ! అవన్నీ చూసుకుంటే అది రియల్ లౌ కాదు."

మరింక నేనేం మాట్లాడలేదు.

ఆ రెండేళ్ళూ జైరాజే శ్యామలగా, శ్యామలే జైరాజ్‌గా హుషారుగా కాలం గడిపేసేరు.

నాకొకటి మాత్రం సందేహంగా వుండేది. జైరాజ్ లాంటి అందమైన యువకుడు శ్యామలలో ఏం చూసి ప్రేమించినట్లు?! శ్యామలలో తెచ్చి పెట్టుకున్న అందమేగాని స్వతఃసిద్ధమైన దేమీ లేదు. నల్గురిని ఆకర్షించడానికి ఆమె చాలా శ్రద్ధగా తయారయ్యేది. అన్నీ తెలిసినట్లు వుండాలని తెగ ప్రయత్నించేది. కాని నిజానికి చాలామంది ముందు ఆమె తీసికట్టు. ఆమెకు తెలిసింది కూడ చాలా తక్కువ. అయితేనేం 'లౌ ఈజ్ బ్లైండ్' అన్నారు కదా! అని సమర్థించుకున్నాను.


ఫైనల్ ఎగ్జామ్స్‌కి ముందు శ్యామల హడావుడిగా వాళ్ళ వూరు బయల్దేరింది.

"ఇప్పుడెందుకు? పరీక్షల ముందు" అన్నాను.

"అర్జెంటుగా రమ్మని లెటరొచ్చింది" అంది.

అంతకు మించి నేను అడగలేదు. ఆమె చెప్పనూ లేదు. శ్యామల వెళ్ళిపోయింది.

శ్యామల వెళ్ళిన నాల్గురోజుల కనుకుంటాను, జైరాజ్ స్కూటర్ మీద వెళ్తూంటే బీచ్ రోడ్డులో ఏక్సిడెంటయింది. అతనికి బాగా దెబ్బలు తగిలే




యని తెలియగానే మేమంతా చూడటానికి హాస్పిటల్‌కి వెళ్ళేము.

సున్నితంగా వుండే అతని వళ్ళంతా బాండేజీలతో నిండిపోయింది. అతన్నా పరిస్థితిలో చూడ్డానికి మేమెంతగానో బాధపడ్డాం. జైరాజ్ నావంక మౌనంగా చూసేడు. ఆ చూపులో ప్రశ్న వుంది. అతనికి కావలసిన వ్యక్తి అక్కడ కన పడటం లేదనేమో!

అందుకే అన్నాను. "శ్యామల ఊరెళ్ళింది. మీకు తెలిసే వుంటుంది." అతను తెలియదన్నట్లు తల వూపేడు.

"చాలా అర్జెంటుగా వెళ్ళింది. మీతో చెప్పే టైము లేకపోవచ్చు." అన్నాను, జైరాజ్‌కి కూడ చెప్పి వెళ్లలేదనే ఆశ్చర్యాన్ని దాచుకుని.

ఆ రాత్రి శ్యామల వచ్చింది.

ఎంతో ఉత్సాహం, ఆనందం మూట గట్టుకొచ్చిన దానిలా ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. హుషారుగా నవ్వుతూ ఏమేమిటో చెబుతున్నది.

జైరాజ్ విషయం ఎలా చెప్పాలా అని సతమతమవుతున్న నా చేతిలో రెండు లడ్డూలు పెట్టి 'తిను' అంది.

వాటిని అలాగే పట్టుకుని ఆమె ముఖంలోకి తదేకంగా చూసేను.

"ఎందుకలా చూస్తున్నావు?" అంది నవ్వుతూ.

"చాలా సంతోషంగా వున్నావు కారణం ఏమిటా అని" అన్నాను.

"వర్రీ లేదు బుర్ర పనిచేస్తున్నదే!" అంటూ శ్యామల సూట్‌కేస్‌లోంచి ఒక పెద్ద కవరు తీసింది. దాన్లోంచి మరో

కవరు తీసి నా చేతికిచ్చి "చూడు." అంది.

నేను అర్థం చేసుకున్నాను. అది పెళ్ళి శుభలేఖ!

శ్యామలదే అయివుంటుంది. జైరాజ్ గురించి ఇంట్లో చెప్పి ఏకంగా ఒప్పించుకుని శుభలేఖలతో సహా వచ్చేసిన శ్యామలని ఒక పక్క అభినందిస్తూనే మరో పక్క జాలిపడ్డాను.

"జైరాజ్ పరిస్థితి తెలిస్తే....!"అనుమానాలతో కొట్టుకు పోతున్న నన్ను మోచేత్తో పొడిచి "తెరచి చూడవోయ్." అంది. "నేనెంత ట్యూబ్‌లైటునయినా ఆమాత్రం గ్రహించగలనులే" అంటూ కవరు లోంచి కార్డు తీసేను.

నా కళ్ళు నాకు అబద్ధాన్ని చూపిస్తున్నాయి.

అది శ్యామల పెళ్ళి శుభలేఖే!

కాని పెళ్ళికొడుకు జైరాజ్ కాదు!

మధుసూధనరావు, ఎమ్.ఎస్., ఎఫ్. ఆర్. సి. ఎస్. కార్డు నా చేతిలోంచి జారిపోయింది.

"అన్యాయం!" అరిచేను నేను.

శ్యామల అసహనంగా చూసి క్రింద పడ్డ కార్డు తీసింది

"నేను ఒక ఫారిన్ రిటర్న్‌డ్ భార్యను కాబోతున్నానని అసూయ!" అంది వత్తి పలుకుతూ.

"అసూయ కాదు! అసహ్యం! నువ్వు జైరాజ్‌ని డిసీవ్ చేసేవు!" అన్నాను గట్టిగా.

"ఎందుకలా గట్టిగా అరుస్తావు నీకేదో అన్యాయం జరిగినట్లు! ఇది నాజీవితం. నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను" అంది తాపీగా.

"అవును నీ జీవితం నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. కాని జైరాజ్ జీవితం పాడుచేయటానికి నీకెవరు అధికారం యిచ్చేరు?"

శ్యామల గమ్మత్తుగాభుజాలెగరేసింది "అతని జీవితం ఎవరు పాడుచేసేరు? నేను అతన్ని పెళ్ళిచేసుకోనంత మాత్రాన అతని జీవితం పాడవ్వటానికి అతనేం అమ్మాయి కాదు." అంది.

"మరతనితో ప్రేమాయణం ఎందుకు సాగించేవు?" అన్నాను కోపంగా.

శ్యామల వ్యంగ్యంగా నవ్వి "నీకు చెప్పాల్సిన అవసరం నాకు లేదు. అయినా అడిగేవు కనుక చెబుతా విను. అతనితో స్నేహం ప్రారంభించిన మొదట్లో అతన్ని పెళ్ళిచేసుకునే వుద్దేశ్యం నాకసలు లేనేలేదు. మొదటినుండి మా బావను చేసుకోవాలనుకున్నాను. అతని అంగీకారం కోసం ఎదురుచూస్తున్నాను. జైరాజ్ అంటే కాలేజీలో వున్న క్రేజ్ చూసేను. అమ్మాయిల కళ్ళలో ఆరాధన చూసేను. ఏకారకంగా నల్గురి చేత గుర్తింపబడాలన్న తపన వున్న నేను అతనితో స్నేహం చేసేను. ఆ

విధంగా అతని లవర్‌గా గుర్తింపు నేను అనుకొన్నదానికంటే ఎక్కువే లభించింది. అంతేగాని, నాకు అతనిపట్ల క్రికెట్‌గాని, అతని గిటార్ సంగీతంపట్ల మోజుకాని లేవు. అయితే జైరాజ్‌పట్ల నాకు చిన్నచూపు లేదు. అతను నన్ను ప్రేమిస్తున్నట్లు నాకు తెలుసు. అతను అందగాడు, తెలివైనవాడు. కాని మా బావకన్నా అధికుడు కాడు. మా బావ జైరాజ్ అంత అందగాడు కాకపోయినా, అతనికన్నా పై స్టేటస్‌లో వున్నవాడు. అందం చూడగానే ఆకర్షిస్తుంది గాని తర్వాత దేనికి పనికొస్తుంది? ఒక మహానుభావుడు ఏమన్నాడో తెలుసా! ప్రపంచంలో అందమైనవన్నీ ఉత్త పనికిమాలినవని. బావగాని ఖచ్చితంగా నన్ను పెళ్ళిచేసుకోనని చెబితే నేను జైరాజ్‌నే చేసుకునేదాన్ని.

"కాని లక్కీగా మా అత్త హార్టెటాక్ వచ్చి చచ్చిపోవడంతో మా బావ నన్ను చేసుకోవటానికి అంగీకరించేడు. దానితో మా కథ మరో మలుపు తిరిగింది. ఇప్పుడు చెప్పు. నేను జైరాజ్‌ని కాదనటంలో వున్న తప్పేమిటో? ప్రపంచమంతా డబ్బు చుట్టూ, హోదాల చుట్టూ తిరుగుతున్నది. అలాంటప్పుడు ఒక మెట్టుపైనున్నవాడితో జీవితాన్ని పంచుకుని సుఖపడా లనుకోవటంలో తప్పేముంది?"

ప్రేమ పేరు చెప్పి అంత నయవంచన చేసిదికాకుండాడు,. అంత

తెగించి మాట్లాడగల మనిషితో నేనింకేం వాదించగలను?

"ఆ తర్వాత కథ మనకి అప్రస్తుతం. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఆ ఇంటి మనుష్యుల మనస్తత్వాలు నువ్వు అంచనా వేసుకోగల్గుతావని" అన్నాను చెప్పడం ఆపి.

గాయత్రి ముఖంలో ఆశ్చర్యం ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది.

తిరిగి నేనే అన్నాను "తల్లి బ్రతికి వున్నాళ్లూ తన ఉద్దేశ్యమేమిటో చెప్పకుండా తల్లిచాటు బిడ్డలా నటించి తీరా ఆమె చనిపోయేక శ్యామల్ని వివాహమాడిన రాజేంద్ర తండ్రి మనస్తత్వం, వ్యక్తిత్వం ఎలాంటివో నీ కర్థమయే వుంటుంది. శ్యామల సంగతి సరేసరి. ఒడ్డు చేరుకోవడానికి ప్రేమ పేరు చెప్పి జైరాజ్‌ని తెప్పలా వాడుకుంది. ఇక రాజేంద్ర సంగతికి వద్దాం. వాళ్లిద్దరికి పుట్టినవాడు కాబట్టి మోసగాడవుతాడని నేను జ్యోతిష్యం చెప్పను. కాని శ్యామల, కొడుకు ప్రేమ కథ గురించి చులకనగా మాట్లాడుతున్నప్పుడు బయటికి వచ్చి, ఎదిగిన వ్యక్తిగా ఒక్కమాట మాట్లాడలేకపోయేడు. గాయత్రి తల్లిని నేనే అని తెలిసినపుడు కూడ నాతో మాట్లాడాలని ప్రయత్నించలేదు. అతని నడవడి ఎందుకో నాకు చాల కృత్రిమంగా గోచరించింది. ఒక్కమాటలో చెప్పాలంటే అతను పునాది లేకుండా కట్టిన బరిమేడలాంటింవా"

గాయత్రి తలవంచుకుంది. దాని మనసు దెబ్బతిని వుంటుంది. రాజేంద్ర మీద అది చాలా ఆశలు పెట్టుకుందేమో!

"పద. చాల చీకటి పడింది, భోంచేద్దాం" అన్నాను దాని భుజంమీద చేయుంచి.

గాయత్రి మౌనంగా అనుసరించింది. భోంచేస్తున్నా నేను గాయత్రిని ఒక కంట కనిపెడుతూనే వున్నాను. గాయత్రి బేలలా కన్నీళ్లు పెట్టుకోలేదు. ఏదో ఆలోచిస్తున్న దానిలా భోజనం ముగించింది.

"చూడు గాయత్రీ, నేను చెప్పిన దంతా నావైపు నుంచే, నువ్వు కూడ నిదానంగా ఆలోచించి నిర్ణయం తీసుకో." అన్నాను వెళ్తున్న గాయత్రిని వుద్దేశించి.

"అలాగేనమ్మా" అంటూ వెళ్లిపోయింది తన గదిలోకి.

* * *

కాఫీ కప్పు తీసుకుని గాయత్రి గదిలోకి అడుగుపెట్టేను. గాయత్రి స్నానం చేసి న్యూస్‌పేపర్ చూస్తున్నది.

కాఫీ అందుకుని "థాంక్యూ మమ్మీ!" అంది.

నేను ఆశ్చర్యంగా దాని ముఖంలోకి చూసేను. సిగ్గుపడుతున్నట్లు నవ్వింది. ఎందుకో గాయత్రి ముఖం నాకు చాలా అమాయకంగా, ముద్దుగా అన్పించింది. పసితనం వీడని ఆ కళ్ళు స్వచ్ఛంగా మెరుస్తున్నాయి. మెల్లిగా దాని చేతిని చేతిలోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాను.

"అమ్మా!"

ఏమిటన్నట్లు చూసేను.

"సిద్ధార్థని చేసుకోవటం నాకు యిష్టమే," అంది తల వంచుకుని.

ఆశ్చర్యంతో నాకళ్ళు వెడల్పయ్యేయి.

"కాని...." సందేహంగా నా వంక చూసింది.

"కాని?" అన్నాను నేను చెప్పమన్నట్లుగా రెట్టిస్తూ,

"సిద్ధార్థని ఒక్కసారి పిలిపించగలవా?"

"ఎందుకు?" అన్నాను కుతూహలంగా.

"నాకు భర్త కాబోయే వ్యక్తి దగ్గర నా కెలాంటి రహస్యాలు వుండటం నా కిష్టం లేదు. అతనికి రాజేంద్ర విషయం చెబుతాను."

నేను ఒకక్షణం విస్తుబోయి చూసేను. నా కళ్ళముందు పుట్టిన గాయత్రి ఎంతగానో ఎదిగి మరెంతగానో ఎత్తున నిలిచినట్లనిపించింది. దాని విశిష్టమైన వ్యక్తిత్వానికి, నిజాయితీకి మనసులో ఎంతగానో అబ్బురపడ్డాను. శిఖరంలాంటి నా కూతురు లోయలాంటి శ్యామల కుటుంబంలోకి విరిగి జారిపడనందుకు ఎంతగానో సంతోషించి, "అలాగే. సిద్ధార్థని రమ్మని కబురుచేస్తాను" అన్నాను ఉత్సాహంగా.

నాకు తెలుసు. సిద్ధార్థలాంటి సంస్కారవంతుడు గాయత్రి ప్రేమకథని అర్థంచేసుకోగలడని.

———